

# నేనే నా ఆయుధం

– డా.యండమూరి వీరేంద్రనాథ్



## సామాన్యుడి అసామాన్య విజయం.. ఒక యదార్థ గాథ!

"ఢిల్లీలో రాష్ట్రపతి భవన్ బ్రేక్‌ఫాస్ట్ టేబుల్ ముందు కూర్చున్నప్పుడు...
కాకినాడలో పోస్టర్లు అతికించటానికి వాడగా మిగిలిపోయిన మైదా పిండితో
చపాతీలు కాల్చుకుని తిన్న రోజులు గుర్తొచ్చి కళ్ళ నీళ్ళొచ్చాయి".

వ్యాపారంలో పోటీ... ఎత్తులు – పైఎత్తులు...
విస్తరించటానికి చేసే ప్రయత్నాలు... ఎక్కే శిఖరాలు, పడే లోయలూ...
ఆర్టీసీ బల్లల మీద నిద్ర... సులభ్ కాంప్లెక్స్‌లలో స్నానం..!
పదో క్లాసు ఫెయిల్ నుంచి... డాక్టరేట్ వరకూ..!

అట్టడుగు స్థాయి నుంచి లక్షల సంపాదన వరకూ ఎదిగిన
ఒక నిరుద్యోగి జీవిత చరిత్ర...!
ప్రతీ నిరుద్యోగీ, వ్యాపారవేత్తా, జీవితంలో పైకి రావాలనే తపన ఉన్న
ప్రతి వ్యక్తీ చదవవలసిన పుస్తకం.

మాస్టర్ రైటర్
**యండమూరి వీరేంద్రనాథ్** కలం నుంచి...

(క్రిందటి సంచికనుంచి కొనసాగింపు)

## 11

ఇంటర్ రెండో సంవత్సరం వరంగల్‌లో నా బ్యాచిలర్ జీవితం ప్రారంభం అయ్యింది. రూమ్ అద్దె నెలకు అరవై రూపాయలు. ఇంట్లోంచే పప్పు, చింతపండు, అయిదు లీటర్ల కిరోసిను తీసుకెళ్ళాను. కూరగాయలు కొనుక్కునేవాడిని కాను. రోజూ అన్నం, పప్పు, ఆవకాయతో భోజనం పూర్తయ్యేది.

దాదాపు సంవత్సరం పాటూ ఇలాగే సాగింది. ఆంధ్రా బ్యాంక్‌లో మొట్టమొదటిసారి ఎకౌంట్ ప్రారంభించాను. అందులోంచి నెలకి డెబ్బై అయిదు రూపాయలు మాత్రమే తీసుకొనేవాడిని. స్కాలర్‌షిప్ ఎనిమిది వందల యాభై రూపాయలతోనే రెండో సంవత్సరం అంతా గడపాలనుకున్నాను.

అలాగే జరిగింది కూడా.

అదృష్టవశాత్తూ సెకండ్ ఇయర్ అన్ని సబ్జెక్టులూ పాసైపోయాను.

డిగ్రీకి నాకు మూడు కాలేజీల్లో సీటు వచ్చింది. ఆర్ట్స్ అండ్ సైన్స్, ఎల్.బి., సి.కె.ఎం..

ఎల్.బి. అంటే లాల్ బహదూర్ కాలేజీ. అందరూ 'లవ్ బర్డ్స్ కాలేజీ' అనేవారు. నేను చదివిన కాలేజీలో లెక్చరర్స్ అందరూ బాగా పరిచయముండటంతో చివరకు సి.కె.ఎం కాలేజీలోనే చేరిపోయాను.

కాలేజీకి వెళ్ళేటప్పుడు దార్లో పెద్ద పెద్ద పునాదుల గోతులు కనబడేవి. అక్కడో హోటల్ కడుతున్నారని తెలిసింది. ఆ హోటల్లో ఎలాగైనా పనిచేయాలని కాంక్ష పెరిగింది. కానీ చదువుకుంటూ పని చేయలేము. టైపిస్టులకీ, షార్ట్ హ్యాండ్ నేర్చుకొనే విద్యార్థులకీ హోటల్లో పార్ట్ టైం ఉద్యోగం ఇస్తారని తెలిసింది. అప్పుడు టైప్ ఇన్‌స్టిట్యూట్‌లో చేరి ఇంగ్లీషూ, తెలుగు లోయరూ, హయ్యరూ పాసయ్యాను.

చివరకు ఆ హోటల్లో చేరలేదుగానీ, నాకున్న అనుభవంతో చెపుతున్నాను. ప్రతీ విద్యార్థీ వేసవి శలవల్లో కనీసం టైపు లోయర్ వరకన్నా నేర్చుకోవాలి. కంప్యూటర్ మన జీవితాలతో ఎంతగానో పెనవేసుకుపోయింది. చూపుడు వేలితో కాకుండా పది వేళ్ళతో టైప్ చేస్తే, ఎంతో సమయం ఆదా అవుతుంది.

ఆ తరువాత కంప్యూటర్ నేర్చుకోవడానికి మా బావ సాయం చేసాడు. బావ గురించి ప్రసక్తి వచ్చింది కాబట్టి మా కుటుంబం గురించి కొంచెం చెప్పాలి.

దేవులపల్లి కృష్ణ శాస్త్రిగారెక్కడో 'పదిలంగా అల్లుకున్న పొదరిల్లు మాది...' అని పాట వ్రాశారు. మా కుటుంబం అలాగే ఉండేది. అందరం కలివిడిగా ఉండేవాళ్ళం. డబ్బు అవసరం వస్తే, ఎంత కష్టమైనా ఒకరికొకరు సాయం చేసుకునేవారం.

దానికో ఉదాహరణ చెపుతాను.

స్టడీ టూర్ కోసం అరకు వెళ్ళటానికి డబ్బులు కావల్సి వచ్చి, ఒక రోజు పొద్దున్నే మా అక్క ఊరు వెళ్ళి డబ్బు కావాలని చెప్పాను. ఎందుకని కూడా అడక్కుండా రెండు వందలు తెచ్చి ఇచ్చింది.

ఆ తరువాత తెలిసింది... మరుసటిరోజు ప్రొద్దున్నే పొలంలో వేయటానికి పెట్టిన యూరియా బస్తాల్లో ఒకటి పక్కింటి వాళ్ళకు అమ్మి, ఆ రెండు వందలూ తీసుకొచ్చి ఇచ్చిందని..!

ఇంతకన్నా హృద్యమైన మరొక విషయం ఏమిటంటే, మా అక్క కూతురి పెళ్ళికి వెళ్ళినప్పుడు నాకు తేలు కుట్టింది. మా అక్కలు ముగ్గురూ, ఒకవైపు పెళ్ళి జరుగుతూంటే ఆ సంబరాలు మానేసి, నా చుట్టూ చేరి చాలా బిగ్గరగా రోదించసాగారు. నొప్పి లేదని చెప్పినా వినలేదు. 'మమ్మల్ని సంతోషంగా ఉంచటానికి నువ్వు అబద్దం చెపుతున్నావ'ని మళ్ళీ ఏడుపు మొదలుపెట్టారు. దాదాపు పెళ్ళి ఆగిపోయేటంతగా గొడవ చేసారు.

మా చిన్న బావ పేరు రాజేశ్వర రావు. చాలా సౌమ్యుడు. వ్యవసాయం చేస్తూ ఉంటాడు. నేనూ, మా చిన్నన్నయ్యా తరచూ దెబ్బలాడుకుంటూండేవాళ్ళం. అప్పుడు మా ఇద్దరినీ కూర్చోబెట్టి అన్నదమ్ములు కలివిడిగా ఉంటే వచ్చే లాభాలు వివరించేవాడు.

ఏ పుస్తకాలూ చదవకపోయినా ఆయనకి క్రైసిస్ మానేజ్‌మెంట్ గురించి బాగా తెలుసు. మాది పెద్ద కుటుంబం అని ముందే చెప్పాను కదా. పెద్ద కుటుంబం అనగానే అలకలూ, దెబ్బలాటలూ సహజం. మా కుటుంబంలో ఏ సమస్య వచ్చినా అందరికన్నా ముందు వచ్చేది రాజేశ్వరరావు బావే. ఎంత పట్టుదలతో ఉన్నవాళ్ళనైనా కూర్చోబెట్టి ఒక మెట్టు దిగేలా చేసి రాజీ చేసేవాడు.

నాకు ముగ్గురు బావలు. పండక్కి వచ్చేటప్పుడు కొత్త బట్టలు వాళ్ళే తెచ్చుకొనేవారు. ఊరందరి ముందూ మా పెద్దన్నయ్య ఇచ్చినట్టు వాటిని కట్టుకొని తిరిగేవారు. వారి ప్రేమా ఆప్యాయతలు ఆ విధంగా ఉండేవి.

బహుశ ఈ బంధాలే నన్ను ఒక వలయం నుంచి రక్షించాయి.

## 12

మా కాలేజి క్రమశిక్షణకి మారుపేరు. ర్యాగింగ్ అసలు ఉండేది కాదు. లెక్చరర్లు చాలా అంకిత భావంతో పాఠాలు చెప్పేవారు. ఎన్ని విప్లవ భావాలున్నా, విద్యార్థులు చాలా మర్యాదతో నమ్రతగా ఉండేవారు.

ఒక రోజు నా స్నేహితులు ఇద్దరు వచ్చి "మనం ఒక చోటుకి వెళ్ళాలి" అన్నారు. ముగ్గురం కలిసి కాలువ ఒడ్డుకు వెళ్ళాం.

అక్కడే మొట్ట మొదటిసారి రామ్మూర్తి నాకు పరిచయం అయ్యాడు. అతడు క్లాస్‌మేటే కానీ, నాకు అంతగా పరిచయం లేదు. నా స్నేహితులకి బాగా తెలుసు.

ఈలోపు అక్కడికి మరో కుర్రవాడు వచ్చాడు. పొడుగ్గా, బక్కపలచగా ఉన్నాడు. అతడి పేరు గుర్తులేదు. సుందర్రావు అనుకుందాం. అతడిని చూసి గుర్తు పట్టాను.

అప్పుడే ఒక సినిమా విడుదలయింది. అందులో పద్మనాభం ఒక అమ్మాయి వెనుక పువ్వు పట్టుకొని "మీ పువ్వు...మీ పువ్వు" అని వెంటపడుతూ ఉంటాడు.

ఈ సుందర్రావు కూడా కాలేజీలో ఒక అమ్మాయి వెనుక ఇలాగే పడి ఏడిపిస్తూ వేధించేవాడు. ఆ విధంగా అతడు నాకు తెలుసు.

కొంచెంసేపు మామూలు సంభాషణ అయ్యాక, రామ్మూర్తి సుందర్రావుని "ఆ అమ్మాయి ఓ.కే. చెప్పిందా?" అని అడిగాడు.

"లేదు. ఇంకా చెప్పలేదు" అన్నాడు అతడు.

"చెప్పకపోతే ఇంకా ఎందుకు తిరుగుతున్నావు?"

సుందర్రావు తేలిగ్గా నవ్వి, "నాలుగు రోజులు తిరిగితే అదే చెప్తుంది" అన్నాడు.

అప్పుడు కొట్టాడు రామూర్తి. ఎంత బలంగా కొట్టాడంటే, వాడు వెళ్ళి కాలువలో పడ్డాడు.

మేమందరం ఈ సంఘటన ఊహించలేదు.

రామ్మూర్తి అడుగు ముందుకేసి తర్జని చూపిస్తూ,"మన కాలేజీ పేరేంటో తెలుసా? సి.కె.ఎం..! అంటే క్రమశిక్షణ. అలాంటి కాలేజిలో ఒకమ్మాయి వెనుక తిరుగుతావురా... రాస్కెల్. పైగా నాలుగుసార్లు తిరిగితే అదే పడుతుందంటావా?" అన్నాడు.

"ఆ అమ్మాయి మీకు దగ్గరా?" అని అడిగాడు సుందరరావు బురద తుడుచుకుంటూ. అప్పటికే చెంప వాపు ప్రారంభమైంది.

"నీ చెల్లి వెనుక ఎవరైనా తిరిగినా కూడా ఇలానే కొడతాను. మళ్ళీ ఇంకొకసారి ఇలాంటి వేషాలు వేస్తే బురద దులుపుకోవటానికి చేతులు కూడా ఉండవు" అన్నాడు రామ్మూర్తి.

ఆ విధంగా అతడితో నాకు మొదటి పరిచయం జరిగింది.

---

నాకు విప్లవ సాహిత్యం పరిచయం చేసింది రామ్మూర్తే. అప్పుడే నేను చైనా విప్లవం, గోర్కీ అమ్మ, వరవరరావు పుస్తకాలూ, రష్యన్ విప్లవం విపరీతంగా చదవటం ప్రారంభించాను. ఆ భావాలు నాకెంతో బాగా నచ్చేవి.

రామ్మూర్తికి కూడా అదే భావాలు ఉండటంతో మేమిద్దరం చాలా సన్నిహితులమయ్యాము. అతడు నన్ను బాలగోపాల్, హరగోపాల్ ఉపన్యాసాలకి తీసుకెళ్ళేవాడు. కాళోజీతో సన్నిహితుడనయ్యాను. ఆయన ఎంతో విశదంగా విప్లవం ఎందుకు రావాలో చెపుతూండేవాడు.

మీరు 'శ్రీమంతుడు' అనే సినిమా చూసారా? ఆ సినిమాలో లాగే ప్రతీ పల్లెటూళ్ళోనూ ఆ రోజుల్లో (ఇప్పటికీ కొన్ని ఊళ్ళల్లో) కొందరు మేధావులనబడే దరిద్రులూ, దందాలు చేసేవారూ ఉండేవారు. స్థలవివాదాల నుంచీ, దంపతుల సమస్యల వరకూ, ఊళ్ళో ప్రతీ గొడవకీ వాళ్ళే పరిష్కారాలు చెప్పేవారు. పెనాల్టీలు వేసేవారు. ఆ పెనాల్టీల డబ్బుతో మందు కొట్టి విలాసవంతంగా జీవించేవారు. వాళ్ళ మాటే వేద వాక్కు. వాళ్ళ ఆటలు సాగాలంటే బీద వాళ్ళు బీద వాళ్ళుగానే ఉండాలి. ఎవరూ ఎక్కువ చదువుకోకూడదు. పల్లె బాగు పడకూడదు. రోడ్డు పక్కన భుముల మీద కన్ను పడిందంటే వాటిని తమవారికి అమ్మాల్సిందే. అచ్చు శ్రీమంతుడు సినిమాలో లాగానే.

తమ సమస్యల కోసం పోలీసుల దగ్గరకు వెళ్ళే ధైర్యం ఊళ్ళో ఎవరికీ ఉండేది కాదు.

ఆ రోజుల్లో రెండు రకాల యూనియన్లు ఉండేవి. ఒకటి రాడికల్ స్టూడెంట్స్ యూనియన్, మరొకటి రాడికల్ యూత్ లీగ్. ఈ రాడికల్ విద్యార్థులు కాలేజీలో జరిగే అక్రమాలూ, చుట్టు పక్క పల్లెల్లో జరిగే అన్యాయాలూ ఒక లిస్ట్ తయారు చేసేవారు. వీటిని యూత్ లీగ్‌కి ఇచ్చేవారు. ఈ లీగ్ సభ్యులు అడవుల్లోనో, పట్నంలో అండర్‌గ్రౌండ్లలోనో ఉంటారు. వాళ్ళొచ్చి ఈ రౌడీల్ని, పెద్దమనుషులుగా చెలామణీ అవుతూ అఘాయిత్యాలు చేసే వాళ్ళనీ పట్టుకొని చావ బాదేవారు.

ఈ లీగ్‌కి యువకులు బాగా ఆకర్షితులు అయ్యేవారు. అన్యాయాన్ని ఎదుర్కొంటున్నామనే ఫీలింగ్ ఆ విధంగా యూత్‌లో బాగా నాటుకుపోయింది.

అయితే ఈ రాడికల్ యూత్ లీగ్ సభ్యులకి జీవితం గులాబీ పాన్పు కాదు. పోలీసులకి దొరికితే వీళ్ళని ఎన్‌కౌంటర్ చేయటమో, ఎముకలు విరగ్గొట్టటమో చేసేవారు.

అయినా సిద్ధాంతం కోసం నిలబడ్డ వాళ్ళు, తమ ఆలోచనలని మార్చుకొనే వారు కాదు. కోర్టుకెళితే సాక్ష్యాలు చెప్పేవారు లేక కేసు వీగిపోయేది. బయటపడేవారు. అలా బయటకొచ్చిన నలుగురైదుగురు ప్రస్తుతం చాలా పెద్దపెద్ద స్థానాల్లో ఉండటం, రాజకీయ నాయకులుగా ఎదగటం జరిగింది.

ఇప్పటికీ పోలీసు రికార్డుల్లో వాళ్ళ పేర్లు ఉన్నాయి. పేర్లు చెపితే మీరు ఆశ్చర్యపోతారు. అప్రస్తుతం కూడా.

---

రామ్మూర్తి ప్రభావం నా మీద పెరగసాగింది. రామ్మూర్తీ, నేనూ చర్చించు కొనేటప్పుడు ఎప్పటికైనా అన్నలను కలవాలనీ, కనీసం ఒకసారి వారితో మాట్లాడాలనీ అనుకొనేవాళ్ళం.

మేం కాలేజీలో కుర్రవాడిని కొట్టి వాడిని సన్మార్గంలో పెట్టిన విషయం అన్నలకు తెలిసి, వాళ్ళు రామ్మూర్తిని పిలిపించి మాట్లాడారు. ఇది ఒక మలుపు.

కాలక్రమేణా రామ్మూర్తికి అన్నలతో సంబంధాలు బలపడ్డాయని చూచాయిగా తెలిసింది. దానికి తార్కాణం ఆ తరువాత జరిగిన సంఘటన.

ఆ రోజుల్లో వరంగల్‌లో ముగ్గురు పేరు పొందిన గూండాలుండేవారు. వాళ్ళ మాట అక్కడ శాసనంలా జరిగి పోయేది. బ్రాందీ షాపుల వారిని బెదిరించడం నుంచీ, సినిమా బ్లాక్ మార్కెటింగ్ వరకూ, వాళ్ళు చేయని అఘాయిత్యమంటూ లేదు. సెటిల్మెంట్  వల్ల వచ్చిన డబ్బులతో వీళ్ళే కొన్ని బ్రాందీ షాపులు కూడా స్థాపించారు.

ఎక్కడ సంపాదించాడో తెలియదుకానీ రామ్మూర్తి ఒక రివాల్వరు తీసుకొచ్చి ముగ్గుర్నీ నిలబెట్టి పది రోజుల్లో పట్నం ఖాళీ చెయ్యక పోతే 'షూట్' చేస్తానని బెదిరించి, వరంగల్ నుంచి పంపించేశాడు. కొంతకాలం పాటూ ఆ చుట్టుపక్కల రౌడీయిజం చాలావరకూ తగ్గిపోయింది.

---

రామ్మూర్తి మీద రోజురోజుకీ నాకు గౌరవం పెరగసాగింది. మరోవైపు అతని మీద పోలీసు నిఘా ఎక్కువైంది. స్నేహితులం అయినందువల్ల మా మీద కూడా ఒక కన్నేసి ఉంచారు.

ఒకరోజు మా రూమ్ మీద పోలీస్ రైడింగ్ జరిగింది. ఏ మాత్రం విప్లవ సాహిత్యం కనబడినా సరే ఆ రూంలో ఉన్నవాళ్ళని తీసుకెళ్ళి లాకప్‌లో పడేయటమో, ఎన్‌కౌంటర్ చేయటమో చేసేవారు.

కానీ అదృష్టవశాత్తూ అటువంటి సాహిత్యం వారికి కనబడలేదు.

రామ్మూర్తి నెమ్మది నెమ్మదిగా పెరగసాగాడు. అతడు సెటిల్‌మెంట్ చేస్తే దానికి తిరుగుండేది కాదు. "నీ భార్యను తీసుకొని ప్రేమగా ఏలుకో" అని అతడు శాసించాడంటే ఇక జీవితాంతం ఆ దంపతులు సుఖంగా సంతోషంగా ఉన్నారన్నమాటే. గొప్ప విషయమేంటంటే, అలా చేసినందుకు పైసా ఆశించేవాడు కాదు.

ఒకరోజు రామ్మూర్తి వచ్చి మా రూమ్ మేడ పైన (టెర్రస్‌లా ఉండేది. మెట్లు ఉండేవి కాదు. సన్-షేడ్ పట్టుకుని ఎక్కాలి) పడుకుండి పోయాడు. పోలీసులు వచ్చి అతని కోసం వెతికారు. అతను పైనున్న విషయం మాకు తెలీదు.

ఆ తరువాత తెలిసిన విషయం ఏమిటంటే రామ్మూర్తి ఏదో పెద్ద గొడవలో ఇరుక్కొని దాదాపు హత్య చేసిన పరిస్థితులలో వచ్చి పడుకున్నాడని.

ఆ వివరాలు నాకు ఇప్పటికీ పూర్తిగా తెలీదు.

మా గదిలో నలుగురం. అందులో ప్రవీణ్ శర్మ అని ఒక కుర్రవాడుండేవాడు. అతడికీ కమ్యూనిజానికీ ఏమీ సంబంధం లేదు. అతడి తండ్రి పురోహితుడు. పెళ్ళిళ్ళు చేసేవాడు. ఈ ప్రవీణ్ శర్మ చాలా అమాయకుడు.

"నేను బ్రాహ్మణుడిని. నా కాళ్ళకు మొక్కు. నీకు పుణ్యం వస్తుంది" అని నాతో జోకులేసేవాడు.

విప్లవభావాలతో మరిగిపోతున్న నేను "జీవితంలో ఏ వ్యక్తి పాదాలూ మొక్కను. వ్యక్తి పూజకు వ్యతిరేకిని" అనేవాడిని.

"ఎప్పటికైనా నీతో నా కాళ్ళు మొక్కించుకుంటాను" అని అతడు ఎదురు సవాలు విసిరేవాడు.

ఒకరోజు రామ్మూర్తి నాతో "మనమిద్దరం ఈ రాత్రి ఒక పల్లెకు వెళ్ళాలి. అక్కడ అన్నలు కవాతు చేస్తున్నారు" అంటే ఉత్సాహంగా వెళ్ళాను. అందరితో కలిసి ఊళ్ళో కవాతు చేసాను.

ఊళ్ళో ఉండే మేకవన్నె పులుల్నీ, దాదాల్నీ, గూండాల్నీ భయపెట్టటానికే ఇలాంటి కవాతులు అని రామ్మూర్తి చెప్పాడు.

కవాతు జరిగాక మమ్మల్ని వెళ్ళిపోమన్నారు.

ఇంతలో వాళ్ళు ఒక వ్యక్తిని చేతులు వెనక్కి కట్టి ఊళ్ళోంచి తీసుకువచ్చారు. నక్సలైట్లతో సన్నిహితంగా ఉంటూ, మరోవైపు పోలీస్ ఇన్‌ఫార్మర్‌గా... అన్నలకి అన్నంలో విషం కలిపి, వాళ్ళు స్పృహ తప్పి పడిపోయాక పోలీసులకి కబురు చేస్తే, ఆరుగుర్నీ ఎన్‌కౌంటర్ చేసి చంపేసారట.

దానికి ప్రతీకారంగా ఆ వ్యక్తి నడుం చుట్టూ బాంబులు కట్టి ఊరి బయటకు తీసుకెళ్ళారు.

మేము నడుస్తూ ఉండగా వెనుక పెద్ద విస్ఫోటనం వినిపించింది. ఇది నేను ఊహించలేదు. బాగా బెదిరిపోయాను.

మరుసటి రోజు పేపర్లలో ఇది పెద్ద పెద్ద అక్షరాల్తో వార్తగా వచ్చింది.

ఆ రోజు సాయంత్రం కాలువ వద్దున వ్యాహ్యాళికి వెళ్ళినపుడు రామ్మూర్తితో, "చట్టాన్ని ఇలా చేతుల్లోకి తీసుకోవటం తప్పు కదా అన్నా?" అన్నాను.

ఎన్నో సినిమాల్లో విన్న డైలాగు.

అతడు వెంటనే సమాధానం చెప్పలేదు. కొంచెంసేపు మౌనంగా ఉండి ఆలోచనగా, "ఆ సుందర రావు మారాడా?" అని అడిగాడు.

అతడు సబ్జెక్టు ఎందుకు మార్చాడో అర్థం కాలేదు. "ఆ. బాగా మారిపోయాడు" అన్నాను.

"ఆ అమ్మాయి హ్యాపీగా ఉన్నదా?"

"ఆ అమ్మాయి ఫ్రెండు మన క్రిష్ణకి చెల్లెలి వరస అవుతుంది. ఆమెతో చెప్పిందట. చాలా హ్యాపీగా ఉన్నానని" అని ఒక క్షణం ఆగి, "చాలా టార్చర్ చేసాడన్నా. మొత్తానికి కథ సుఖాంతమైంది" అన్నాను.

అతడు చిన్నదైన స్వరంతో, "నేను సుందర్రావుని కొడుతున్నపుడు ఇవే మాటలు... అదే.... 'చట్టాన్ని మన చేతుల్లోకి తీసుకోకూడదు కదన్నా' అని అప్పుడెందుకు అనలేదు?" అని ప్రశ్నించాడు.

షాక్ అయ్యాను.

సాచి పెట్టి మొహం మీద కొట్టినట్టయింది.

ఏమీ సమాధానం చెప్పలేకపోయాను.

తిరిగి అతడే అన్నాడు. "ఆ అమ్మాయి పడిన బాధ కన్నా, మన పల్లెల్లో ప్రజలు కొన్ని వేల రెట్లు, లక్షల రెట్లు బాధ పడుతున్నారు. పోలీసులు ఏమీ చెయ్యలేరు. చెయ్యరు కూడా. మనమే చెయ్యాలి".

నేను పూర్తిగా కన్విన్స్ అయ్యానా? ఏమో..! ఒకవైపు బాంబు విస్ఫోటనంలో తెగిపడిన అవయవాలు గుర్తు వచ్చేవి. మరోవైపు పెద్ద మనుష్యులుగా చెలామణీ అయ్యేవారు చేస్తున్న ఘాతకాలు చూస్తుంటే అన్నలు చేసే పనే కరెక్ట్ అనిపించేది.

ఈ విధంగా నేను సతమతమవుతున్నప్పుడు అనుకోకుండా మరో ఘోరం జరిగిపోయింది.

రామ్మూర్తి వరంగల్ రోడ్ల మీద సైకిల్ మీద వెళ్తూ ఉండగా ఒక పోలీస్ గుర్తుపట్టి, "ఆగు" అని అరిచాడు.

ఈ హఠాత్పరిణామానికి రామ్మూర్తి కన్‌ఫ్యూజ్ అయ్యాడు.

ఈలోపు పోలీసు బిగ్గరగా  అరుస్తూ అతడి వైపు పరుగెత్తుకు రాసాగాడు. అతడి అరుపు విని స్టేషన్ లోపలి నుంచి ఇనస్పెక్టరు బయటకు వచ్చాడు.

రోడ్డు మీద నడుస్తూన్న జనమంతా అక్కడేం జరుగుతూందో తెలియక చెల్లా చెదురవసాగారు.

పోలీసు తరుముతూన్న వ్యక్తి 'అన్నల తాలూకు పవర్‌ఫుల్ వ్యక్తి' అని తెలియని కొందరు యువకులు, అతడు సాధారణ దొంగ అనుకుని సైకిల్ని ఆపటానికి ప్రయత్నం చేసారు.

ఒక వైపు పోలీసూ, వెనుకే ఇనస్పెక్టరూ, మరో వైపు జనం... ఇలా చుట్టుముట్టేసరికి రామ్మూర్తి ఆ టెన్షన్‌లో  రివాల్వర్ తీసి పోలీసుని కాల్చేసాడు.

ఆ గుండు గురి తప్పి వెళ్ళి వెనుక ఉన్న ఇనస్పెక్టర్‌కు తగిలి అతడు అక్కడికక్కడే మరణించాడు.

ఇదంతా పోలీస్ స్టేషన్ ముందు జరిగింది.

స్టేషన్‌లోంచి మరికొందరు పోలీసులు వచ్చేలోపులో రామ్మూర్తి సైకిల్ అక్కడే వదిలేసి సందుల్లోకి పరుగెత్తాడు..

వెనుక వైపు నుంచి మా రూంకి  వచ్చి స్నానం చేసి, అక్కడి నుండి మాయం అయిపోయాడు.

పత్రికల్లో వచ్చే వరకూ మాకీ విషయాలు ఏమీ తెలీదు. మరుసటిరోజు ఈ వార్త పతాక శీర్షికల్లో అన్ని పత్రికల్లో వచ్చాక అప్పుడు తెలిసింది.

పోలీసులు ఈ విషయాన్ని చాలా సీరియస్‌గా తీసుకున్నారు.

దొరికుంటే మా అందర్నీ ఆరోజే ఎన్‌కౌంటర్ చేసేవారు.

నేను తప్పించుకున్నాను. నామీద ఎవరికీ అనుమానం లేదు గానీ, ఎందుకైనా మంచిదని మా వెంకటాపురం వెళ్ళిపోయాను.

కానీ ప్రవీణ్ శర్మ దొరికాడు. అతన్ని తీసుకెళ్ళి చావబాదారు.

అప్పుడే అతడి మెదడుకి దెబ్బ తగిలింది. దాదాపు సంవత్సరంపాటూ ఆసుపత్రిలో  ఉండి బయటకు వచ్చాడు. పైకి బాగానే ఉండేవాడు గానీ, మెదడుకు తగిలిన దెబ్బ వల్ల, కొంతకాలం పోయాక తనలో తనే మాట్లాడుకోవటం, అర్ధరాత్రి నిద్రలో లేచి బిగ్గరగా అరవటం చేసేవాడు.

అతడి తండ్రి పురోహితుడు. చుట్టు పక్కల పల్లెలన్నిటిలోనూ ఆయనే వివాహ కార్యక్రమాలు నిర్వహించేవాడు. ప్రవీణ్ శర్మ కూడా అందులో నిష్ణాతుడయ్యాడు.

నా పెళ్ళికి పురోహితుడు వాడే. తండ్రిని వద్దని తనే వచ్చాడు. మూడు గంటల పాటూ ఎక్కడెక్కడి మంత్రాలో శాస్త్రోక్తంగా చదివాడు. పెళ్ళి మంత్రాలు అంతసేపు చదువుతారని మాకు తెలీదు. పల్లెలో అందరూ సంభ్రమంతో ఆనందించారు.

పెళ్ళయిన తర్వాత కాళ్ళకు దండం పెడుతున్నప్పుడు "చూశావా! నా పంతం నెగ్గించుకున్నాను" అన్నాడు.

నేను నవ్వి "ఈసారి నేను నీకు మనస్ఫూర్తిగానే కాళ్ళకు దండం పెట్టాను" అన్నాను.

అంతే. ఆ తరువాత అతడు మాకు కనపడలేదు. మంచం పట్టాడని తెలిసింది. మెదడుకి తగిలిన దెబ్బ వల్ల క్రమక్రమంగా మతి స్థిమితం కోల్పోయి పిచ్చివాడై, ఆ తర్వాత సంవత్సరానికి మరణించాడని తెలిసింది.

(కొనసాగింపు వచ్చే సంచికలో..)